## స్వాముల శరణు ఘోష



ఊరేగింపులో స్వాముల ఆటపాటలు

బీహెచ్‌ఈఎల్ కాలనీలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం రాత్రి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఏనుగుపై అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని వాళ్ల వీధుల్లో పంచ వాయిద్యాల నడుమ, అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో మహా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

– రామచంద్రాపురం(పటాన్ చెరు):

## అమ్మో ఎన్ని జీవాలో!



న్యాల్‌కల్‌లోని ప్రధాన వీధి గుండా వెళ్తున్న గొర్రెలు, మేకలు

సాధారణంగా గ్రామాల్లో పదుల సంఖ్యలో జీవాలు కనిపిస్తుంటాయి. కానీ గురువారం ఉదయం న్యాల్‌కల్‌లో వందల సంఖ్యలో జీవాలు(గొర్రెలు, మేకలు) కనిపించాయి. ప్రధాన వీధుల అవి వెళ్తుంటే ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. వామ్మో ఎన్ని మేకలు, గొర్రెలు ఇలా గుంపులు, గుంపులుగా వెళ్తున్నాయని చర్చించుకున్నారు. కర్నాటక ప్రాంతానికి చెందిన పశుపోషకులు గొర్రెలు, మేకలతో ఇక్కడికి వచ్చారు. ఇక్కడ మేత మేపేందుకు వచ్చామని, నెలన్నర పాటు ఇక్కడే ఉండి తర్వాత వెళ్లిపోతామని వారు తెలిపారు.

– న్యాల్‌కల్(జహీరాబాద్):

# ఉల్లి.. కల్పవల్లి

- ఉల్లి నారు సాగు చేస్తూ లాభాలు
- దానికి తోడు కూరగాయల పంటలు
- వారంతపు సంతల్లో విక్రయాలు
- ఆదర్శంగా నిలుస్తోన్న మహదేవుపల్లి రైతులు

**ఉల్లికి మార్కెట్‌లో ఎప్పుడూ గిరాకీ ఉంటుంది. ధర తగ్గితే రైతులకు, పెరిగితే వినియోగదారులకు కన్నీళ్లు పెట్టిస్తోంది. అయితే ఉల్లి సాగు కోసం తోటి రైతులకు విత్తనాలు, నారు రూపంలో అందిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు మండలంలోని మహదేవుపల్లి రైతులు. తక్కువ విస్తీర్ణంలో ఉల్లి నారు, దానికి తోడుగా కూరగాయలు పండించి జేబు నిండా డబ్బులు సంపాదిస్తున్నారు.**



ఉల్లినారులో కలుపు మొక్కలు తీస్తున్న రైతులు

**కల్హేర్(నారాయణఖేడ్):** సంగారెడ్డి జిల్లా కేంద్రానికి 80 కిలోమీటర్ల దూరంలో 161వ జాతీయ రహదారికి ఇరువైపులా వ్యవసాయం పొలాలు ఉన్న మహదేవుపల్లి గ్రామ రైతులు 20 ఏళ్లగా ఉల్లి నారు సాగు చేస్తున్నారు. ఉల్లి నారు పండిస్తూ.. సాధారణం కంటే ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారు. జాతీయ రహదారికి అనుకొని పొలాలు ఉండడమే వీరికి వరంగా మారింది. వానాకాలంలో వరి కోతలు, పంట కాలం పూర్తి కావడంతో వెంటనే ఉల్లి నారు పెంచేందుకు తమ భూములను ఉపయోగిస్తారు. గ్రామనికి చెందిన సుమారు 40 నుంచి 50 కుటుంబాలు ఉల్లి నారును సాగు చేసి ఉల్లి గడ్డ పండించే రైతులకు విక్రయిస్తున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు వారంతపు సంతల్లో వీరి వద్ద నుంచి నారు విక్రయిస్తున్నారు. నవంబర్, డిసెంబర్‌లో ఉల్లి నారు సాగు చేస్తారు. ఉల్లి నారుకు అక్టోబర్ చివరి వారం నుంచి జనవరి వరకు డిమాండ్ ఉంటుంది. సాగుచేసిన ఉల్లి నారు 45 రోజులకు నాటేందుకు సిద్ధమవుతోంది. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాలోని వివిధ గ్రామాల ఉల్లి రైతులు నారు తీసుకొని వెళ్లి నాటుతారు. ఉల్లి నారు ఎదుగుదల, విస్తీర్ణాన్ని బట్టి రూ. వెయ్యి నుంచి 3,500 వరకు రైతులే ధరను నిర్ణయిస్తారు. ఉల్లి నారును అర ఎకరా నుంచి ఎకరా వరకు సాగు చేయడం ద్వారా రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు లాభాలను ఆర్జిస్తారు. ఉమ్మడి జిల్లాలోని నారాయణఖేడ్, జోగిపేట, నర్సాపూర్, మెదక్, రామాయంపేట, పెద్దశంకరంపేట, కామారెడ్డి జిల్లా బాన్సువాడ, ఎల్లారెడ్డి, పిట్లం, బిచ్కుంద, తదితర చోట్ల వారంతపు సంతల్లో ఉల్లి నారు, కూరగాయలు విక్రయాలు చేస్తున్నారు. మంచి లాభాలు పొందుతూ తోటి ఉల్లి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్ మేరకు టమాటా, వంకాయ నారుతో పాటు వివిధ రకాల ఆకుకూరలు, కాయగూరలను సాగుచేస్తూ ఏడాదిపాటు అదనపు లాభాలను పొందుతున్నారు.



వారాంతపు సంతలో ఉల్లి నారు విక్రయిస్తున్న రైతులు

### సంతలు తిరిగి అమ్ముతాం



ఉల్లి నారు అమ్మేందుకు రోజూ వివిధ సంతలు తిరుగుతాం. ముందు రోజు మడి నుంచి నారు తీసి బస్తాల్లో నింపి ఆటోల్లో తరలిస్తాం. గ్రామంలో చాలా మంది రైతులు ఉల్లి నారు పండిస్తున్నారు. అమ్మేందుకు మాత్రమే కష్టంగా ఉంటుంది. తెలిసిన రైతులు పొలం వద్దకు వచ్చి తీసుకెళ్తారు.

– లాలయ్య, మహదేవుపల్లి

### నారు విక్రయించేందుకు పోటీ



అందరూ రైతులు ఉల్లి నారు తీసుకుని ఒకే చోట కూర్చుండడంతో విక్రయించేందుకు మార్కెట్‌లో పోటీ తప్పడం లేదు. అయితే జనవరి చివరి వరకు మాత్రమే నారు విక్రయించే అవకాశం ఉంటుంది.

– నీరుడి సాయిరాం, మహదేవుపల్లి

# ముత్తంగి క్రీడా ప్రాంగణానికి నిధులు

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి హామీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు టౌన్:** తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి గ్రామంలోని క్రీడా ప్రాంగణం అభివృద్ధికి నిధులు కేటాయించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా విస్తరిస్తున్న ముత్తంగి గ్రామ పరిధిలో క్రీడా ప్రాంగణం ఎంతో అవసరమన్నారు. ఇక్కడ క్రీడా కోర్టులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ ఉపేందర్, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్, మేరాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎక్కడ చెత్త అక్కడే...

- రోడ్డు పక్కనే చెత్తాచెదారం
- సేకరించకుండా నిర్లక్ష్యం



రోడ్డు పక్కనే నిలిపివేసిన ట్రాక్టర్, పోగైన చెత్తాచెదారం

**ఝరాసంగం(జహీరాబాద్):** అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో గ్రామాల్లో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో చెత్తను తడి, పొడిచెత్తను వేరువేరుగా సేకరించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేస్తున్నా క్షేత్రస్థాయిలో అవి అమలు కావడంలేదు. మండల పరిధిలోని కప్పాడ్ గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే పంచాయతీ ట్రాక్టర్‌ను నిలిపివేశారు. అందులో సేకరించిన చెత్త అలాగే ఉంది. అంతే కాకుండా రోడ్డు పక్కనే చెత్త చెదారం దర్శనమిస్తోంది. 20రోజుల నుండి చెత్త సేకరణ జరగటం లేదని ప్రజలు వాపోతున్నారు. ఒకవేళ సేకరించినా.. ఆ చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు పక్కన చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



షాపును ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

**మునిపల్లి(అందోల్):** ప్రభుత్వ ఉద్యోగం రాలేదని బాధపడకుండా స్వయం ఉపాధితో ధార్థికంగా అభివృద్ధి చెందాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సాయికుమార్, మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్ అన్నారు. గురువారం మండలంలోని హైద్లాపూర్ గ్రామంలో నిరుద్యోగి స్వయం ఉపాధి కోసం ఏర్పాటు చేసుకున్న కిరాణం షాపును ప్రారంభించి మొదట వారే సరుకులను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత స్వశక్తిగా ఉపాధి అవకాశాలను ఏర్పర్చుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఇతర సంస్థలపై ఆధారపడి సమయం వృథా చేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బండారి పాండు, బక్కన్న, బాగన్న, రమేశ్, అక్బర్, శివయ్య, మొగులయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఖేడ్‌లో బాలవీర్ దివస్



నివాళులర్పిస్తున్న భీమ్‌ఆర్మీ బాధ్యులు

**నారాయణఖేడ్:** ఖేడ్ అంబేడ్కర్ భవన్‌లో గురువారం భీమ్‌ఆర్మీ ఆధ్వర్యంలో బాలవీర్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఫతేసింగ్, జోరావర్‌సింగ్ చిత్రపటాలను పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భీమ్‌ఆర్మీ జిల్లా కార్యదర్శి ఉమాసింగ్ మాట్లాడుతూ.. సిక్కుమాత 10వ గురువు గురు గోవిందొసింగ్ కుమారులు ఫతేసింగ్, జోరావర్‌సింగ్‌లను ఇస్లాం మతంలో మారడానికి నిరాకరించినందుకు 1704 డిసెంబరు 26న ఔరంగాజేబ్ సైన్యదళపతి సిర్హాండ్ నవాబ్ ఇటుక గోడల్లో సజీవంగా బంధించి చంపేశారన్నారు. భీమ్‌ఆర్మీ జిల్లా, స్థానిక బాధ్యులు అనుముల తుకారాం, కిషన్‌సింగ్, మోహన్, భీంసేన, పాల్గొన్నారు.

# దశాబ్దం గడిచినా బోర్డు మార్చరా?




మల్గి గ్రామ శివారులో ఉమ్మడి రాష్ట్రం పేరున్న బోర్డు

**న్యాల్‌కల్(జహీరాబాద్):** రాష్ట్రం మారి దశాబ్దం గడిచినా ఇంకా చాలా ప్రాంతాల్లోని బోర్డులపై ఉమ్మడి రాష్ట్రం పేరే కొనసాగుతోంది. బోర్డులపై ఉమ్మడి రాష్ట్రం పేరును చూసి, ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని న్యాల్‌కల్, డప్పూర్ మీదుగా బీదర్ వెళ్లే రోడ్డుపై రాష్ట్ర సరిహద్దు వద్ద ఉన్న బోర్డుపై ఉమ్మడి రాష్ట్రం పేరే ఉంది. కొత్త రాష్ట్రం ఏర్పడి చాలా కాలం గడిచినా పాత రాష్ట్రం పేరును అధికారులు తొలగించడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



జహీరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు

**జహీరాబాద్ టౌన్:** కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కేబినెట్ నుంచి వెంటనే తొలగించాలని మాలమహానాడు ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా గురువారం పట్టణంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో అమిత్ షాపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు దీపక్ ఆకాష్ మాట్లాడుతూ...సమాజంలోని అణగారిన వర్గాలకు హక్కులు కల్పించేందుకు జీవితాన్ని త్యాగం చేసిన అంబేడ్కర్‌పట్ల అమిత్ షా చులకనగా మాట్లాడటం సరికాదన్నారు. వెంటనే ఆయనను మంత్రి పదవినుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు వడ్డి ధనరాజ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు, అంబేడ్కర్ సర్కిల్ అధ్యక్షుడు శ్రీనివాస్, అంబేడ్కర్ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు రాంతీర్థం నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## బడుగు, బలహీన వర్గాలకు సీపీఐ అండ

**నారాయణఖేడ్:** పేద, మధ్యతరగతి, కార్మికులు, కర్షకులు, బడుగు, బలహీన వర్గాలకు సీపీఐ అండగా ఉంటుందని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద్ అన్నారు. పార్టీ శత వార్షికోత్సవాల్లో భాగంగా నారాయణఖేడ్ అంబేడ్కర్ చౌక్‌లో పార్టీ జెండాను ఎగురవేశారు. పార్టీకి అనుకూలంగా నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పార్టీ నిరంతరం పేదల హక్కులు, సంక్షేమం కోసం పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు దత్తురెడ్డి, చిరంజీవి, అశోక్, సతీష్, ప్రేమ్‌కుమార్, బాలయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.



జెండా ఎగురవేసి, నినాదాలు చేస్తున్న నాయకులు

# కేవల్‌కిషన్ స్ఫూర్తితో ఉద్యమిద్దాం

**కంది(సంగారెడ్డి):** కేవల్ కిషన్ ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నర్సింహులు పిలుపు నిచ్చారు. కేవల్ కిషన్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్ర మైన కందిలో సభ నిర్వహించారు. నర్సింహులు మాట్లాడుతూ కేవల్ కిషన్ జీవితమంతా పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేశారన్నారు. పేదల కోసం పోరాడిననాడే కేవల్ కిషన్‌కు నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు ఆనంద్, మమత, షబానా, నసీమా, సునంద, మంజుల, సమీనా తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ కమిటీ



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

**సంగారెడ్డి జోన్:** తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ సంగారెడ్డి డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గురువారం ఎన్నికల అధికారి బాకయ్య నేతృత్వంలో ఏకగ్రీవంగా ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా విరేశం, ప్రధాన కార్యదర్శిగా సంగ్రాం రెడ్డి , అసోసియేట్ అధ్యక్షుడిగా జి.హరిశ్చంద్ర ప్రసాద్, మల్లికార్జున్, కోశాధికారి తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో రంగాధర్, తహసిల్దార్, కరణ్‌కుమార్, దశరథ్, బాలరాజ్, ఈశ్వర్, జవేర్ తదితరులు పాల్గొన్నారు.

### భూలక్ష్మమ్మకు బోనాలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, తదితరులు

**ఝరాసంగం(జహీరాబాద్):** మండల పరిధిలోని కొల్లూర్ చౌరస్తా శివారులోని నూతనంగా నిర్మంచిన శ్రీ భూలక్ష్మమ్మ ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా చివరి రోజు అమ్మవారికి మహిళలు బోనాల ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని మహిళా భకులు బోనాలతో డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, నృత్యాల నడుమ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో ఎమ్మెల్యే మాణిక్‌రావు హాజరై పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మరియమ్మ, మాణిక్, ప్రగతి, జయశేఖర్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగమేశ్వర్, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

### అయ్యప్పస్వామికి లక్ష పుష్పార్చన

**సంగారెడ్డి టౌన్:** సంగారెడ్డి పట్టణం బైపాస్ రోడ్డులోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో మండల మహోత్సవం సందర్భంగా లక్ష పుష్పార్చన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు పుష్పాలను స్వామివారికి సమర్పించారు. రామచంద్రగౌడ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి మహా పడిపూజను జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు కొక్కొండ శ్రీశైలం, కోశాధికారి ప్రేమ్‌సాగర్, ఉపాధ్యక్షులు శేషగిరి, జనప్రియ రాజు, సంయుక్త కార్యదర్శి మామిళ్ల గోపాల్, గురుస్వాములు వెంకన్న, విష్ణువర్ధన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

### మనుస్మృతి ప్రతుల దహనం

**హత్నూర(సంగారెడ్డి):** మండల పరిధిలోని గుండ్లమాచనూర్‌లో గురువారం ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అంటరానితనం రూపుమాపేందుకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఎన్నో పోరాటాలు చేశారని వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎస్‌డీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింగ్ రాజ్ అధ్యక్షుడు సాయమొల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

### పోరాట ఘనత సీపీఐదే

**జహీరాబాద్ టౌన్:** సీపీఐ పేద ప్రజల అభ్యున్నతి కోసం కార్మిక,కర్షలకు హక్కుల కోసం పోరాడిందని, పోరాటాలు చేసిన ఘనత తమపార్టీదేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జలాలోద్దీన్ పేర్కొన్నారు. సీపీఐ శత జయంతి ఉత్సవాలను గురువారం పట్టణంలోని భరత్ నగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జెండాను ఆవిష్కరించి సీనియర్ నాయకులను సన్మానించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ డివిజన్ కార్యదర్శి నర్సింలు మాట్లాడుతూ సీపీఐ ప్రజల పక్షాన నిలబడుతూ వారి సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. పోరాట సందర్భంగా అనేకమంది నాయకులు తమ జీవితాలను త్యాగం చేశారని వారి స్ఫూర్తితోనే భవిష్యత్తు ఉద్యమాలు చేస్తామని స్పష్టం చేశారు.

### అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

**జిన్నారం(పటాన్‌చెరు):** గుమ్మడిదల మండలం మంబాపూర్‌కు చెందిన మద్దూరు చిన్న భాషయ్య గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి చిన్నభాషయ్య అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు సహాయం చేశారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు.

## సంక్షిప్త వార్తలు

**◆ వీరభద్రేశ్వర ఆలయ కమిటీ వైస్ చైర్మన్‌కు సన్మానం**

**జహీరాబాద్ టౌన్:** అందోల్ నియోజకవర్గంలోని రాయికోడ్ భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర ఆలయ కమిటీ వైస్ చైర్మన్ గువ్వ భీమన్న దంపతులను గురువారం ముదిరాజ్ సంఘం నాయకులు సన్మానించారు. వీరభద్రేశ్వర ఆలయ నూతన కమిటీని ఇటీవల నియమించారు. జహీరాబాద్ పట్టణానికి వచ్చిన సందర్భంగా ముదిరాజ్ సంఘం జహీరాబాద్ నియోజకవర్గం నాయకులు బరూర్ దత్తాత్రి తదితరులు ఆయనను సన్మానించారు.

**◆ జగంపేట ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు**

**జిన్నారం (పటాన్‌చెరు):** మండల పరిధిలోని జగంపేట ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వెంకటేశం గౌడ్, భోజరెడ్డి, శంకరప్ప, బండి శ్రీకాంత్ గౌడ్, మహేందర్ గౌడ్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**◆ క్యాలెండర్ ఆవిష్కరణ**

**పటాన్‌చెరుటౌన్:** స్థానిక శ్రీరామలింగేశ్వర దేవస్థానంలో ఆలయ అర్చకులు మహేశ్, గణేశ్ కమిటీ సభ్యులతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేవస్థాన వ్యవస్థాపకుడు శ్రీశైలం మహరాజ్ ఆశీస్సులతో ప్రతి యేడాది క్యాలెండర్లను ఆవిష్కరించి భక్తులకు అందజేస్తున్నామని చెప్పారు.

**◆ ఆస్పత్రిని సందర్శించిన డైరెక్టర్**

**సంగారెడ్డి:** మండల కేంద్రం చౌటకూర్‌లో ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిని అడిషనల్ డైరెక్టర్ వసంత రావు గురువారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలు, మందులు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆస్పత్రి వైద్యురాలు సబిత, సిబ్బంది నర్సయ్య, అజీమ్ ఉన్నారు

**◆ హనుమాన్ ఆలయ సందర్శన**

**నారాయణఖేడ్:** మండలం పరిధిలోని కొండాపూర్‌లో ప్రాచీన హనుమాన్ ఆలయాన్ని రాష్ట్ర రవాణాశాఖ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్ సింగ్ గురువారం సందర్శించారు. పూజలు నిర్వహించి, ఆలయ పీఠాధిపతి, అఖిలభారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహరాజ్ ఆయనకు ఆశీస్సులు అందించారు. మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్ బలరాముడి చిత్రంతో కూడిన జ్ఞాపికను కిషన్‌సింగ్‌కు బహూకరించారు నియోజకవర్గ టీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**◆ భవానీ మాతకు పూజలు**

**కల్హేర్(నారాయణఖేడ్):** మండలం బల్కంచేల్క తండాలోని భవానీ మాత, సేవలాల్ మహరాజ్ మందిరంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ కిషన్‌సింగ్ గురువారం పూజలు చేశారు. డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా సొంత గ్రామంలోని మందిరాన్ని సందర్శించారు. అనంతరం తండావాసులు ఆయన్ను సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో శంకర్, జైల్ సింగ్, రాములు, రూప్ సింగ్, సవాయిసింగ్ పాల్గొన్నారు.

**◆ రేపు గంగా మాతాజీ రాక**

**జహీరాబాద్ టౌన్:** కర్నాటక రాష్ట్రం బసవ ధర్మపీఠ మహిళా జగద్గురు డాక్టర్ గంగా మాతాజీ ఈ నెల 28న జహీరాబాద్ పట్టణానికి వస్తున్నట్లు బసవదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శంకర్‌పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 12వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కర్నాటకలోకి లింగాయత్ ధర్మీయుల పుణ్యక్షేత్రమైన కూడల సంఘంలో సమ్మేళనం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా గంగా మాతాజీ జహీరాబాద్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటారని చెప్పారు. పట్టణంలోని దత్తగిరి కాలనీ బసవ మండపంలో సాయంత్రం 6 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి లింగాయత్‌లు హాజరుకావాలని ఆయన కోరారు.

**◆ క్రీడాకారుడికి సన్మానం**

**రామచంద్రాపురం (పటాన్చెరు):** ఇటీవల బంగ్లాదేశ్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలో వెండి పతకం సాధించిన నవనీత్ ను గురువారం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సంఘం నాయకులు డాక్టర్. వీరవెల్లి ఉమామహేశ్వరరావు, అశ్విన్ కుమార్ మాట్లాడుతూ.. నవనీత్ ఈనెల 17 తేదీ నుంచి 21వ తేదీ వరకు బంగ్లాదేశ్ లో జరిగిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలో పాల్గొని వెండి పతకం సాధించినందుకు తమ సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సాంబశివుడు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**◆ అధికారుల నిర్లక్ష్యం సరికాదు**

**జిన్నారం(పటాన్‌చెరు):** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో సమస్యల పరిష్కారానికి అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని బీజేపీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పలు కాలనీలో పర్యటించి పారిశుద్ధ్య సమస్యలు పరిశీలించారు. ఈ మేరకు పలు మురుగు కాలువలు పొంగిపొర్లుతున్నాయని వీటిపై మున్సిపల్ కమిషనర్కు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమన్నారు. ఇదే మురుగు కాలువలో పారిశుద్ధ్య కార్మికుడు మృతి చెందినా అధికారుల్లో చలనం లేదని వాపోయారు. సమస్యను పరిష్కరించకుంటే మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

**◆ మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు**

**కల్హేర్(నారాయణఖేడ్):** మహిళల కోసం పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని నారాయణఖేడ్ డీఎస్పీ వెంకటరెడ్డి తెలిపారు. గురువారం సిర్గాపూర్ పోలీస్ స్టేషన్ లో మహిళల కోసం బారక్ ప్రారంభించారు. ఎస్పీ రూపేశ్ ఆదేశాల మేరకు మహిళలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సై వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

**◆ భవానీ మాత మందిరంలో డిప్యూటీ కమిషనర్ పూజలు**

**కల్హేర్(నారాయణఖేడ్):** నిజాంపేట్ మండలం బల్కంచేల్క తండాలోని భవానీ మాత, సేవలాల్ మహరాజ్ మందిరంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ మూడు కిషన్ సింగ్ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి పొందిన అతడు సొంత గ్రామం బల్కంచేల్క తండాలోని మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తండావాసులు ఆత్మీయ సన్మానం చేశారు. కార్యక్రమంలో శంకర్, జైల్ సింగ్, రాములు, రూప్ సింగ్, సవాయి సింగ్, తదితరులు పాల్గొన్నారు.

**◆ అట్టహాసంగా అయ్యప్ప పడిపూజ**

**నారాయణఖేడ్:** నారాయణఖేడ్ పట్టణ శివారులోని డోవూరు లొంక హనుమాన్ ఆలయం ఆవరణలో గురువారం అయ్యప్ప దీక్ష ధారులు అష్టాదశ కలశాల పూజను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు గురురాజశర్మ పూజలు నిర్వహించారు. మాల ధారులంతా తెల్లటి దోవతులను ధరించి పూజలోపాల్గొనడం ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.